క్లుప్తంగా

బీఆర్‌ఎస్వీ మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న రేగుల రాజు

దహెగాం: బీఆర్‌ఎస్వీ మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రేగుల రాజు, ప్రధాన కార్యదర్శి దుర్గం వినోద్‌ల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కంబాల నరేందర్, ఉపాధ్యక్షుడిగా పోతరాజుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొల్లపురి రవి, కోశాధికారిగా ఇప్ప ప్రవీణ్, కార్యనిర్వాహకులుగా తిరుపతి, సలహాదారునిగా రాజును ఎన్నుకున్నారు.

బ్యాగ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



బ్యాగులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: బ్యాగ్ ఫిల్లింగ్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పార్గ గ్రామ పంచాయతీలో నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాగుల్లో పోసే మట్టి నాణ్యమైనదిగా ఉండాలన్నారు. మట్టి నింపాక నీళ్లు పట్టాలని సూచించారు. సోమవారం సాయంత్రం వరకు బ్యాగుల్లో మట్టి నింపడం పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 15 వరకు బ్యాగుల్లో విత్తనాలు వేస్తామని పేర్కొన్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 3.50 లక్షల మొక్కలు టార్గెట్ ఉందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బొజ్జిరావు, టీఏ మహేందర్, ఎఫ్ఏ చంద్రు తదితరులు ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో టీచర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కెరమెరి: 317 జీవో అమల్లోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా ఉపాధ్యాయులు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన అనేక మంది ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం 317 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు భరత్‌రావు, సత్యనారాయణ, కాంత్రికుమార్, వివేక్, వినోద్, కృష్ణ, శ్రీకాంత్, హరీష్, వినీత్, సురేశ్ తదితరులు ఉన్నారు.

నేడు బౌద్ధ నూతన కమిటీ ఎన్నిక

కౌటాల: సిర్పూర్ తాలుకా బౌద్ధ నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాలలోని జైత్వన్ బుద్ధ విహార్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సిర్పూర్(టి) నియోజకవర్గంలోని బౌద్ధ బాంధవులు, అంబేద్కర్ అభిమానులు, అధిక సంఖ్యలో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

కూపర్‌లింగో జాతర కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు

తిర్యాణి: ఈనెల 21న మండలంలోని గడలపెల్లి గ్రామంలో నిర్వహించే కూపర్ లింగో జాతరకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద నిర్వాహకులు జెడ్పీటీసీ అత్రం చంద్రశేఖర్‌తో కలిసి విడుదల చేశారు. జాతర నిర్వాహకులు మాట్లాడుతూ కూపర్ లింగో జాతరకు జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోశ్, ఉప సర్పంచ్ తోట లచ్చన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోర్వేత తిరుపతి తదితరులు ఉన్నారు.

ముగిసిన పోతురాజు, ధర్మరాజు జాతర



షష్టి దేవతలకు మొక్కుతున్న మహిళలు





దేవతలకు పూజలు చేస్తున్న ఎంపీపీ మోతీరాం



ఎంపీపీకి పెద్దదేవుని సల్లె, సైలం అందిస్తున్న కటోదా



జెండాలకు మొక్కుతున్న పోలీసులు

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ సమీపంలో గురువారం రాత్రి ప్రారంభమైన పోతురాజు, ధర్మరాజు జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కొలాం తెగకు చెందిన భక్తులు అధికసంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జెండాలు ఎగురవేశారు. ఆలయం వెలుపలి ప్రతిమలకు మంగళహారతులిచ్చారు. భక్తులు సంప్రదాయ నృత్యం చేశారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఎస్సై నల్లా వెంకటేశ్ దేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ భీంబాయి, సర్పంచ్ జగన్నాథ్‌రావు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్, ఉత్సవాల నిర్వాహకులు సిడాం రాజు, సిడాం దర్యూ, సిడాం చిన్న భీము, సిడాం కట్టి, గంగు ఉన్నారు.

భయపెడుతున్న మేఘం..!

మేఘాలు రైతులను భయపెడుతున్నాయి. వారం రోజులుగా పగటిపూట మేఘావృతమై ఉండడంతో పత్తి, జొన్న, వేరుశనగ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కూలీల కొరత కారణంగా పత్తి చాలావరకు ఇంకా చేనులలో ఉంది. దీంతో వానలు కురిస్తే నేలవాలే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.



చేనులో పగిలిన పత్తి

- కప్పేస్తున్న మంచు దుప్పటి
- వారం నుంచి ఇదే పరిస్థితి
- పత్తి, జొన్న పంటలకు తీవ్ర నష్టం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

కెరమెరి: సుమారు పది రోజులుగా ఆకాశం మేఘావృతమై మంచుదుప్పటి కప్పి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 6400 మంది రైతులు ఉన్నారు. అందులో సుమారు 22వేల ఎకరాల్లో పత్తి, 5వందల ఎకరాల్లో జొన్న పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తితీతకు కూలీలు దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల్లో గుబులు

ఓ వైపు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రకృతి మరింత భయపెడుతోంది. పత్తితీతకు కూలీలు లభించక వారాల తరబడి పగిలిన పత్తి చేనుల్లోనే ఉండడంతో బరువుతగ్గే ప్రమాదం ఉంది. ఆకాశంలో మబ్బులు ఉండడంతో జొన్న పంటకు పేను బంక అధికంగా వ్యాపించే అవకాశం ఉంది. ఇది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి, జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

బీమాపై ప్రచారం అంతంతే

రైతులకు పంటల బీమాపై అవగాహన లేకపోవడంతో పంట నష్టం జరిగినప్పుడు అన్నదాతకు నష్టపరిహారం అందడం లేదు. అధికారులు రైతులకు పంట బీమాల గురించి వివరిస్తున్నా రైతులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ 40శాతం వరకు రైతులు కూడా బీమా చేసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు.

పంట రంగు మారుతుంది



మంచుతో పత్తి పంటకు నష్టం వాటిల్లుతోంది. పంటలో ఇప్పటికే దిగుబడి లేదంటే ఉన్న పత్తి పంట రంగు మారుతుంది. దీంతో మార్కెట్లో తక్కువ ధర పలికే అవకాశం ఉంది. ప్రతీరోజు ఉదయం మంచు కురుస్తుంది. జొన్న, వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నాం. అధికారులు తగు సూచనలు అందించాలి.

– గోపాల్, రైతు, మెట్టపిప్రి

ఆందోళన అవసరం లేదు



ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు చూసి రైతులు ఆందోళన చెందవద్దు. పత్తి పంట కొంతవరకు నేలరాలుతుంది. రంగు మారుతుంది. జొన్న కంకి కిందికి వచ్చి ఉంటే పైకి కట్టాలి. ఏ పంటకు కూడా నష్టం ఉండదు. ఏమైనా సందేహాలు ఉంటే ఏఈవోలను సంప్రదించాలి.

– ఎస్. గోపీకాంత్, ఎంఏవో

భగీరథ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా శనివారం మూడోరోజు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ భగీరథ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రతీ నెల మొదటి వారంలో వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రావెలింగ్ అలవెన్స్, ఫోన్ బిల్లులు నెలకు రూ. 5వేలు అదనంగా ఇవ్వాలని పేర్కొన్నారు. సమాన పనికి సమానవేతనాన్ని ఇవ్వాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహేష్, శంకర్, ప్రకాష్, రాజు, గోకుల్, శ్రీకాంత్, భీమ్‌రాజ్, రవీందర్, ప్రేమ్‌సాగర్ కార్మికులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్‌లు అన్నారు. శనివారం తహసీల్దార్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ. 24వేలు అందించాలన్నారు. నాయకులు సాయి, రాకేష్, దుర్గాజీ, రాజు, ఖలీల్, గోపాల్, రాకేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: యూటీఎఫ్ రాష్ట్ర మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం యూటీఎఫ్ నాయకులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ఈనెల 13, 14న రంగారెడ్డిలో జరిగే 5వ మహాసభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. హేమంత్, ఉషన్న, నరేందర్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఆట క్యాలెండర్ ఆవిష్కరణ



కౌటాల: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట శనివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆట) నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల తిరుపతి, సంఘం మండలాధ్యక్షుడు సుశీల, అశోక్, నాయకులు నానాజీ, సాయినాథ్, అంతయ్య, మధుకర్, శైలజ, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం టీయూటీఎఫ్ సంఘం నూతన క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవోతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణేశ్, శ్రీధర్, సుజాత, శేఖర్, రమాదేవి, తిరుమల, సౌజన్య, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్..

చింతలమానెపల్లి: పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ డుబ్బుల నానయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆవిష్కరించారు. సహకార సంఘం వైస్‌చైర్మన్ టోంబ్రె మారుతి, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి శ్రీజ నందిని, సంఘం మండల అధ్యక్షుడు చల్లూరి రమేష్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు ఇందు, శ్రీదేవి, లలిత, అరుణ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేశ్

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని హెచ్‌ఎం మార్త రమేశ్ అన్నారు. శనివారం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్‌పై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పెల్ వైజెడ్, స్టోరీ టెల్లింగ్ అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఎం.శ్యాంరావు, సత్యనారాయణ, రాజు, జ్యోత్స్న, రాజబాబు, జయరాం, తదితరులు ఉన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రెబ్బెన: మండలంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్యలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్లడ్ డ్యామేజ్ రోడ్ల కోసం మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను శనివారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలోని పాత మాద్వాయిగూడ, జెండాగూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మాద్వాయిగూడ నుంచి పాత మాద్వాయిగూడ వరకు రూ.6లక్షలు, మాద్వాయిగూడ నుంచి జెండాగూడ వరకు రూ. 10లక్షలతో రోడ్డు పనులు మంజూరయ్యాయని తెలిపారు. సర్పంచ్ దోబే పార్వతి, ఉప సర్పంచ్ గోపాల్, నాయకులు తులసీరాం, రవీందర్, విలాస్, ఆనంద్, సంతోష్, మోహన్ పాల్గొన్నారు.

చాక్‌పీస్ పట్టి.. పాఠం బోధించి



పాఠాలు బోధిస్తున్న ఎంపీపీ సౌందర్య

రెబ్బెన: ప్రజా పాలనలో నిత్యం బిజీగా ఉండే ఎంపీపీ జుమ్మిడి సౌందర్య శనివారం ఉపాధ్యాయురాలి అవతారం ఎత్తారు. మండలంలోని పోతపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె తెలుగు, ఇంగ్లీష్ పదాలను బోర్డుపై రాసి విద్యార్థులతో చదివించారు. చదువులో తీసుకోవాల్సిన మెలుకువలు నేర్పించటంతో పాటు స్వయంగా పాఠాలు బోధించారు. అనంతరం మన ఊరు మన బడి పనులను పరిశీలించారు.

మెరుగైన ఫలితాలకు కృషి చేయాలి



రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీరోజు ఉదయం పాఠశాలకు వచ్చిన వెంటనే అల్పాహారంతో పాటు రాగిజావ తీసుకోవాలన్నారు. అల్పాహారం పంపిణీ చేస్తున్న అన్నపూర్ణ ట్రస్టును ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవో బిక్షపతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వైఎస్సార్‌టీపీ నాయకుడు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు శివరాం నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మర్సకోల సరస్వతి, అనిల్‌గౌడ్, వసంత్‌రావు, రాథోడ్ శేషారావు, గుండ శ్యాం, చరణ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

రెబ్బెన: కేజీబీవీల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోషియేషన్ రాష్ట్ర మొదటి మహాసభల వాల్ పోస్టర్లను శనివారం గంగాపూర్‌లోని కేజీబీవీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోషియేషన్ మండల సభ్యులు జ్యోతి, లీల, సుమలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వరి నారు మడుల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: యాసంగిలో సాగు చేస్తున్న వరినారు మడులను శనివారం మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పరిశీలించారు. మండలంలోని మోసం, ఆరెగూడ గ్రామాల్లోని వరినారు మడులను పరిశీలించారు. నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారుమడుల్లో కోళ్లు, పశువులు, గొర్రెల ఎరువులు, వర్మీకంపోస్టు వేయడం వల్ల నారు తొందరగా పెరగడంతో పాటు చలి తీవ్రత తట్టుకుంటుందన్నారు.



నారుమడి పరిశీలిస్తున్న ఏవో

కాగజ్‌నగర్‌లో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్



అభినందిస్తున్న డీఈవో అశోక్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో శనివారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జ్ఞాన ప్రతిష్ఠాన్, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరు కాగా, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వసతి కల్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బిక్షపతి, నాయకులు రవిశంకర్, లాలాజీ, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, పూర్ణచందర్‌రావు, రాధాకృష్ణ, ఎనగంటి బిక్షపతి, కటుకం మధూకర్, నజీర్ అహ్మద్, సింధూజ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాస్థాయి ప్రతిభ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శనివారం డీఈవో అశోక్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అశ్విత్, అంజన్నలు ప్రతిభ పరీక్షలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు యూజీసెట్ (డిగ్రీ)కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. యూజీసెట్ 2023కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.